Digital, tmedia.net.in

టీ-మీడియా

TMEDIA 11వ వార్షికోత్సవం 2016 - 2026 మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఆదివారం ఆగస్టు 02, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

గాదేపాడులో గ్రామసభ నిర్వహణ

● మహిళల భద్రత, పారిశుద్ధ్యం, గ్రామాభివృద్ధిపై కీలక నిర్ణయాలు

టీ మీడియా,ఆగస్టు01,సింగరేణి(కారేపల్లి): ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని గాదేపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ రంజిత్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ ఉపేందర్,వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,వివిధ శాఖల అధికారులు,గ్రామస్థులు పాల్గొన్నారు.గ్రామసభలో మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.అలాగే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.అనంతరం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై చర్చించి,ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామానికి వచ్చే నిధులను ఏయే అభివృద్ధి పనులకు ఎంత మేర కేటాయించాలనే అంశంపై సర్పంచ్ అధ్యక్షతన తీర్మానాలు చేశారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోయే మూడు నెలల పాటు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.ప్రతి శుక్రవారం 'డ్రై డే--ఫ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తీర్మానించారు.అలాగే గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని,దోమల నివారణ కోసం ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల మందు పిచికారీ చేపట్టాలని గ్రామసభలో నిర్ణయం తీసుకున్నారు.గ్రామ ప్రజల సహకారంతో పరిశుభ్రమైన,ఆరోగ్యకరమైన గ్రామంగా గాదేపాడును తీర్చిదిద్దాలని సర్పంచ్ రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు.

తల్లిపాలే శిశువుకు తొలి టీకా

● అంగన్వాడీలో తల్లిపాల వారోత్సవాలు

టీ మీడియా,ఆగస్టు01,సింగరేణి(కారేపల్లి): ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సింగరేణి మండలం వెంకటయ్య తండా పరిధిలోని గిద్దవారిగూడెం--2 అంగన్వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ జర్పుల శాంతి గర్భిణీలకు,బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం అత్యంత అవసరమని,పుట్టిన తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు.తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని రకాల పోషకాలు ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.తల్లిపాలు శిశువుకు తొలి ఆహారం,తొలి టీకా,ప్రకృతి ప్రసాదించిన అమృతమని పేర్కొన్నారు.ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రతి తల్లి తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించుకుని,శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని జర్పుల శాంతి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మాంటిసోరి స్కూల్‌లో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు

టీ మీడియా,ఆగస్టు01,సింగరేణి(కారేపల్లి): ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రంలోని మాంటిసోరి స్కూల్‌లో ఆదివారం సెలవు దినం కావడంతో శనివారం స్నేహితుల దినోత్సవం (ఫ్రెండ్‌షిప్ డే)ను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని,శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్నేహబంధం గొప్పతనాన్ని చాటిచెప్పారు.పలు సరదా కార్యక్రమాల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మినీ జోజో మాట్లాడుతూ,చిన్నతనం నుంచే పిల్లల్లో స్నేహభావం,పరస్పర గౌరవం,సహకార భావన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.స్నేహం జీవితంలో ఎంతో విలువైనదని,మంచి స్నేహితులు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్నేహం విలువను వివరించి,ప్రేమ,ఆప్యాయత,పరస్పర సహకారంతో మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలతో అభివృద్ధిని ఆపలేరు

● కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్

టీ మీడియా, ఆగస్టు 01, రామకృష్ణాపూర్; క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఎన్ హెచ్-363 పక్కన గల భరత్ నగర్, దుబ్బపల్లి సర్వీసు రోడ్డులో గల కల్వర్టును సందర్శించిన అనంతరం శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే పరిష్కారం చూపాల్సిన ప్రతిపక్షం, సమస్యను వదిలేసి మంత్రి మాటలను కత్తిరించి సోషల్ మీడియా,వాట్సప్ వేదికల ద్వారా దుష్ప్రచారం చేయడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందన్నారు.ప్రజలకు నిజాలు చెప్పే ధైర్యం లేక అసత్య ప్రచారాలతో రాజకీయ మనుగడ కోసం తాపత్రయపడటం సిగ్గుచేటు అన్నారు.మంత్రి సంఘటన స్థలంలో ఫోటోగ్రాఫర్‌కు సమస్య తీవ్రత, దెబ్బతిన్న ప్రాంతం స్పష్టంగా కనిపించేలా ఫోటోలు తీయండి.

వాస్తవ పరిస్థితిని పెద్దపల్లి ఎంపీ,కేంద్ర రహదారుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పనులు మంజూరు చేయించేలా ప్రయత్నిద్దాం అనే ఉద్దేశంతో మాత్రమే సూచనలు చేశారని ఆయన తెలిపారు.విమర్శించే మీరు అధికారంలో ఉన్నప్పుడు దీనిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.

కమిషన్ల కోసం కక్కుర్తి పడి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుకున్నారని ఎద్దేవా చేశారు.ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించకుండా, మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు.పుర సమస్యల పరిష్కారానికి కూడా మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

అసత్య ప్రచారాలతో అభివృద్ధిని ఆపలేరని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పనితో సమాధానం చెబుతుంది.దుష్ప్రచారం చేసే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలని బిఆర్ఎస్ పాలకవర్గానికి కోరారు.ప్రజా ప్రయోజనాలే అందరికీ ముఖ్యమని,అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి

.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

టీమీడియా, న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యార్థులకు మోదీ "క్షమాపణలు" చెప్పాలని, అంతేకానీ వారిని "క్షమించడం" కాదని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించని ప్రధాని, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని దుయ్యబట్టారు. తమిళనాడులోని మామల్లపురంలో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. అనంతరం ఎక్స్‌లో పోస్ట్‌లో కేంద్రప్రభుత్వంపై, ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

"కోల్పోయిన ప్రతి చిన్నారి ప్రాణం వెనుక, ఎప్పటికీ వీడని వేదనను మోస్తున్న ఒక కుటుంబం ఉంటుంది. అలాగే, విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది. విద్యార్థులతో నిజాయతీగా ఉండని వ్యవస్థలో, మన విద్యార్థులను నిజాయతీగా చదవమని చెబుతున్నారు. అయినా, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడేంత ధైర్యం ప్రధానమంత్రికి ఉంది. బిడ్డలను కోల్పోయి దుఃఖిస్తున్న ఒక్క తల్లి, తండ్రిని కూడా మోదీ కలవలేదు. లీక్ అయిన ప్రశ్నపత్రం వల్ల భవిష్యత్తు నాశనమైన ఒక్క విద్యార్థితో కూడా ఆయన కూర్చోని మాట్లాడలేదు."– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

మరోవైపు, తన సందేశంలో యువ నిరసనకారులు ఉపయోగించిన భాషపైనే మోదీ దృష్టి సారించారని, కానీ నిరసనకారుల పట్ల ప్రభుత్వం, పోలీసుల వ్యవహారశైలిని ప్రస్తావించడంలో విఫలమయ్యారని వామపక్ష విద్యార్థి సంఘం ఐసా పేర్కొంది.

దాడిని ఖండిస్తూ ఆర్కెపి డివైసిఎంఓ కు వినతి పత్రం

టీ మీడియా, ఆగస్టు 1, రామకృష్ణాపూర్: కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో పారామెడికల్ సిబ్బంది పై జరిగిన దాడిని క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని సింగరేణి ఏరియా హాస్పిటల్ సిబ్బంది తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆర్కెపి డివైసిఎంఓ డాక్టర్ మధు కుమార్ కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. అలాగే వారు మాట్లాడుతూ హాస్పిటల్ లో పనిచేస్తున్న సిబ్బంది భద్రతకు యాజమాన్యం భరోసా ఇవ్వాలని, ఈ సంఘటనపై యాజమాన్యం సమగ్ర సర్వే నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.